క్లుప్తంగా

రోడ్లపై వ్యాపారాలు చేయవద్దు



పూల వ్యాపారిని తరలిస్తున్న అధికారులు

విజయనగరం: రోడ్లపై వ్యాపారాలు చేయవద్దని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. నగరంలోని గంటస్తంభం, కోడిరామ్మూర్తి వ్యాయామ శాల, న్యూపూర్ణ జంక్షన్ ప్రాంతాల్లో రోడ్లు పక్కన, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేస్తున్న చిరువ్యాపారులను శనివారం వేరే ప్రాంతానికి తరలించారు. నిర్దేశిత ప్రాంతాల్లో మాత్రమే వ్యాపారం చేసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. నగర క్రమబద్ధీకరణ చర్యల్లో భాగంగా ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రజల రాకపోకలకు అవస్థలు లేకుండా ఈ చర్యలు చేపడుతున్నామని కమిషనర్ తెలిపారు.

పోలీసుల పల్లెనిద్ర



మజ్జిపేట గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్‌ఐ అశోక్

విజయనగరం క్రైమ్: స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మజ్జిపేటలో ఎస్‌ఐ అశోక్, ఏఎస్‌ఐ మీనాక్షిలు శుక్రవారం రాత్రి పల్లెనిద్ర చేశారు. అంతకుముందు గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, సైబర్ మోసాల పాలిట పడకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. రఘుమండ, చెల్లూరు, జొన్నవలస, మజ్జిపేట, గాజులరేగ, గుంకలాం తదితర గ్రామాల్లో కూడా పోలీస్ సిబ్బంది పల్లెనిద్ర చేశారు.

కరపత్రాల ఆవిష్కరణ

విజయనగరం టౌన్: స్థానిక శిష్టకరణ సంఘం కార్యాలయంలో ఆ సంఘ ఆత్మీయ కలయిక కార్యక్రమానికి సంబంధించి రూపొందించిన కరపత్రాలు శనివారం ఆవిష్కరించారు. కేఎల్ పురం సిక్కుల ఆలయం వద్ద ఉన్న కమ్యూనిటీ ఫంక్షన్ హాల్ వద్ద ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ప్రతిభా అవార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి రేగ సురేష్, కోశాధికారి వాండ్రంగి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మన బడిని మనమే రక్షించుకోవాలి

నెల్లిమర్ల: మన బడిని మనమే రక్షించుకోవాలని జ్యూట్‌మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకుడు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. ఇదే విషయమై ఆయన నగరపంచాయతీ పరిధిలోని కొండపేట ఎయిడెడ్ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం సమావేశమయ్యారు. దశాబ్ద కాలంగా మిల్లు యాజమాన్యం సహకారంతో కార్మిక బిడ్డలకు చదువు అందించేందుకు ఇక్కడ పాఠశాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పుడు అదే పాఠశాలను మూసివేస్తామని చెబుతున్నారని, దానిని మనం వ్యతిరేకించాలన్నారు.

జిందాల్ నిర్వాసితుల నిరసన



బొడ్డవరలో ఎమ్మెల్సీ ఇంటి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నిర్వాసితులు

శృంగవరపుకోట: నిర్వాసితుల సమస్యల్ని పట్టించుకోకుండా పారిశ్రామికవేత్తలకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలు తమ గోడు పట్టించుకుని న్యాయం చేయాలని జిందాల్ నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బొడ్డవరలో గల ఎమ్మెల్సీ రఘురాజు నివాసం ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం జిందాల్ కర్మాగారం కోసం భూములు తీసుకున్నారన్నారు. 18 ఏళ్లయినా ఇంతవరకు పరిశ్రమ రాలేదని చెప్పారు. భూములు ఇచ్చిన తాము కూలీలుగా మారిపోయామన్నారు. సంస్థ ఇవ్వాల్సిన పరిహారం నేటికీ పూర్తి స్థాయిలో అందలేదని చెప్పారు. కంపెనీ కోసం మేము ఇచ్చిన భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కుల పేరిట కంపెనీ పెద్దలు, ప్రభుత్వాలు కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాయని ఆరోపించారు. గత ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు భూమి పూజకు సిద్ధమైనా, నిర్వాసితుల వినతి మేరకు జగన్ సర్కార్ వెనకడుగు వేసిందని తెలిపారు. నిర్వాసితులకు న్యాయం చేసిన తర్వాతే పార్కు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు కూటమి సర్కారు జిందాల్ యాజమాన్యానికి ఒత్తాసు పలుకుతూ భూమిపూజకు సిద్ధ పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మీ మాటలు నమ్మి నాడు జిందాల్‌కు భూములు ఇచ్చామని, ఇప్పుడు తమకు న్యాయం జరిగేలా చూడాలని రఘురాజును కోరారు. ఎమ్మెల్సీ రఘురాజు స్పందిస్తూ క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలను, నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

పచ్చని చెట్లు నరికేశారు!

- మైలాన్–చింతపల్లి రోడ్డులో చెట్లు నరికివేత
- విద్యుత్ తీగలకు అడ్డం అని తొలగింపు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పర్యావరణ వేత్తలు



మైలాన్ రహదారిలో రోడ్డుకు ఇరువైపులా చెట్లు సగానికి నరికివేసిన దృశ్యం

పూసపాటిరేగ: మండలంలోని మైలాన్ జంక్షన్ నుంచి చింతపల్లి వెళ్లే రోడ్డులోని చెట్లను నరికివేశారు. విద్యుత్ తీగలకు అడ్డం ఉన్నాయని, తద్వారా కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్న ఉద్దేశంతో విద్యుత్ శాఖ అధికారులు వాటిని తొలగించారు. ఇదే సాకుతో ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారంగా చెట్లు నరికేస్తున్నారని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ఓ వైపు మొక్కలు నాటడం, చెట్లు పెంచడాన్ని ప్రోత్సహిస్తుంటే మరోవైపు పర్యావరణానికి విఘాతం కలిగించేలా ఇటువంటి చర్యలకు పాల్పడడం దురదృష్టకరమంటున్నారు.

గతంలో కోనాడ జంక్షన్ వద్ద..

కరెంట్ తీగలు చెట్లకొమ్మలకు తగులుతున్నాయని, ప్రతి రెండు నెలలకు ఒకసారి చెట్లు నరికివేస్తున్నారని పర్యావరణ వేత్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కోనాడ జంక్షన్ నుంచి కొత్త కొప్పెర్ల, నడిపల్లి, కోనాడ గ్రామానికి వెళ్లే రహదారిలో ఏపుగా పెరిగిన మొక్కలను తొలగించారు. అదే మాదిరి బూరాపేట, వెల్దూరు, కిలుగుపేట, తిప్పలవలస రోడ్లలో ఎన్నో ఏళ్లుగా పెంచిన చెట్లను రంపాలతో సగానికి కోసేశారు. అధికారులకు తెలిసే ఇదంతా జరుగుతుందా లేకపోతే కావాలనే ఇలా చెట్లు తొలగిస్తున్నారన్న అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెట్లు నరికిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని, చెట్లు తొలగించిన స్థానంలో కొత్త మొక్కలు నాటాలని కోరుతున్నారు.

చెట్లు లేకుంటే పర్యావరణానికి హాని..

చెట్లు తొలగిస్తే పర్యావరణానికి హాని కలుగుతుంది. ఏటా ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజు మొక్కలు నాటండి అని చెబుతున్న వారే చెట్లు నరికివేస్తుండడం విచారకరం. వీలైతే చెట్లు నాటాలి కానీ నరకకూడదు. నరికితే జీవకోటి మనుగడ ప్రమాదకరంలో పడిపోతుంది. –పి.అప్పలనాయుడు, స్నేహ సంస్థ ప్రతినిధి, పూసపాటిరేగ

మొక్కలు నరకడం ఆపాలి..

పర్యావరణానికి విఘాతం కలిగించే చెట్ల నరికివేత చర్యలు ఆపాలి. ఒకవేళ ఏదైనా మంచి కారణం కోసం తప్పనిసరి పరిస్థితుల్లో తొలగించాల్సి వస్తే అదే చోట వైర్లకు తగలని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలి. నాటినప్పుడే వైర్లు తాకే చోట నాటకుంటే ఈ సమస్య వచ్చేది కాదు. అటవీ, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తే ఎటువంటి ఇబ్బందులు తలెత్తవు. –టి.సీతారాం, సర్పంచ్, పూసపాటిరేగ

రక్తదానం.. ప్రాణదానం

- ప్రపంచ రక్తదాతల దినోత్సవంలో వక్తలు



విజయనగరం గంటస్తంభం: స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సన్మానిస్తున్న



విజయనగరం ఫోర్ట్: రక్తదాతల వద్ద ఆస్పత్రి సిబ్బంది

విజయనగరం గంటస్తంభం: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని వక్తలు పిలుపునిచ్చారు. నగరంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని ఎన్వీఎన్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాతలను సత్కరించారు. ఇదే కార్యక్రమానికి హాజరైన జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు బీశెట్టి మాట్లాడుతూ బతికి ఉన్నప్పుడు రక్తదానం, చనిపోయిన తర్వాత అవయవదానం చేసే అదృష్టం ఒక్క మానవుడికే ఉందన్నారు. రక్తదానం, అవయవదానం ద్వారా ఎంతోమందిని కాపాడడంతో పాటు వారిని నమ్ముకుని బతికే మరెంతో మంది జీవితాలు నిలబెట్టినవారమవుతామన్నారు. యువత, విద్యార్థులు రక్తదానం చేసి, ఆదర్శప్రాయులుగా నిలవాలని కోరారు. జిల్లాలో రక్తదాన శిబిరాల నిర్వహణ, రక్తదానంపై అవగాహన కార్యక్రమాల్లో తాడేపల్లి నాగేశ్వరరావు, ఇప్పలవలస గోపాలరావుల కృషి అభినందనీయమన్నారు. డాక్టరు అయ్యగారి కామేశ్వరరావు మాట్లాడుతూ గడిచిన వేసవిలో ఎన్వీఎన్ బ్లడ్‌బ్యాంకు నుంచి పెద్ద ఎత్తున ప్రజలకు సమయానికి రక్తం అందించామని, ఉత్తరాంధ్రలో అత్యధికంగా రక్తదాన శిబిరాలు విజయనగరం జిల్లాలోనే జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులనూ సన్మానించారు.

రక్తదానంపై అపోహలు వీడాలి..

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యవంతులైన ప్రతిఒక్కరూ రక్తదానం చేయవచ్చని సెట్విజ్ సూపరింటెండెంట్ అక్కారావు తెలిపారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని, నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి రక్తనిధి కేంద్రం వద్ద రక్తదాన శిబిరం శనివారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన ఆయన రక్తదాతలను ఉద్దేశించి కాసేపు మాట్లాడారు. రక్తదానంపై ఎన్నో అపోహలు ఉన్నాయని, వాటిని నమ్మవద్దన్నారు. రక్తం దానం చేయడం వల్ల నష్టమేమీ లేదన్నారు. అందరూ రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. అనంతరం పలువురి దాతలు రక్తం దానం చేశారు. కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంక్ వైద్యులు సరోజ్, చంద్రశేఖర్, ఐసీటీసీల జిల్లా సూపర్‌వైజర్ గోపాల్‌రావు, ఆశ్రయ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు బి.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా విజయనగరంలోని ఎన్వీఎన్ బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో జరిగిన రక్తదాతల సన్మాన కార్యక్రమంలో జరజాపుపేటకు చెందిన సాధన యువజన సంఘం అధ్యక్షుడు, రక్తదాత పి.దుర్గాప్రసాద్‌ను శనివారం సన్మానించారు.

జూలై 9న దేశవ్యాప్త సమ్మె



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రమణ

భోగాపురం: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9వ తేదీన దేశవ్యాప్త సమ్మె చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా నాయకుడు టీవీ రమణ తెలిపారు. మండల కేంద్రంలో వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులతో ఆయన శనివారం సమావేశమయ్యారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ, కార్మిక హక్కులు కాలరాస్తూ చట్టాలు సవరణ చేయడాన్ని ఆయన వ్యతిరేకించారు. అలాగే కార్మిక రంగానికి కేంద్రం చేస్తున్న మోసాలను వివరించారు. దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు సూర్యనారాయణ, అంగన్‌వాడీ సెక్టార్ లీడర్ అనిత, వీఆర్ఏల సంఘ నాయకుడు చంద్రరావు, కార్మిక సంఘ ప్రతినిధులు పెద్ది లక్ష్మి, రాము, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ గణేష్

నెల్లిమర్ల రూరల్: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ గణేష్ హెచ్చరించారు. మండలంలోని ఆత్మారాముని అగ్రహారం గ్రామంలో శనివారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పర్యటించిన ఆయన ప్రజలకు వివిధ చట్టాలు, సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో వివాదాలకు తావ్వకుండా శాంతియుత వాతావరణం ఉండేలా చూడాలన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే తమకు సమాచారం అందించాలని కోరారు. యువత మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని సూచించారు. గంజాయి విక్రయించినా, సేవించినా జైలు తప్పదన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల రూరల్: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ పి.త్రినాథరావు ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. విద్యుత్ మరమ్మతు పనుల నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గరికిపేట, కొండగుంపాం, పూతికపేటలకు కరెంట్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

విజయనగరం: జిల్లా కేంద్రంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సంతకాల వంతెన వద్ద ఉన్న ఎత్తు బ్రిడ్జి జంక్షన్ ప్రాంతంలో జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేశారు. వాహన చోదకులు కూడా నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నియంత్రణకు పాటుపడాలని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య శనివారం తెలిపారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ‘యోగాంధ్ర’ లక్ష్యం



యోగా సాధన చేస్తున్న అధికారులు, తదితరులు

- జిల్లా ఆయుష్ అధికారి ఆనందరావు

విజయనగరం: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే యోగాంధ్ర కార్యక్రమ లక్ష్యమని జిల్లా ఆయుష్ అధికారి ఆనందరావు అన్నారు. నగరంలోని పాల్‌నగర్ జంక్షన్ వద్ద సామూహిక యోగాసనాల సాధన శనివారం చేపట్టారు. ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇందుమతి కార్యక్రమానికి హాజరైన వారందరితో యోగాసనాలు వేయించి, వాటి ప్రయోజనాలు తెలిపారు. అంతకుముందు యోగా విశిష్టతను తెలియజేస్తూ ఆర్‌అండ్‌బీ జంక్షన్ వరకు ర్యాలీ చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనాలని కోరారు. నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ మన దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలన్నారు. యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టీపీఆర్వో సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోండి

విజయనగరం గంటస్తంభం: నిబంధనలు అతిక్రమిస్తూ నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సుంకరి గణేష్ డిమాండ్ చేశారు.

నగరంలోని పలు విద్యాసంస్థలను ఆయన శనివారం సందర్శించారు. వేసవి సెలవుల్లోనూ కొన్ని స్కూళ్లు, కళాశాలల్లో తరగతులు నిర్వహించారన్నారు. అటువంటి సంస్థలపై అధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు జశ్వంత్, మహేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

అహ్మదాబాద్ మృతులకు నివాళి



కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

భోగాపురం: గుజరాత్‌లోని అహ్మదాబాద్ వద్ద ఇటీవల జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి మండలంలోని చెరుకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు నివాళులర్పించారు. శనివారం కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టి, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. బాధిత కుటుంబాలకు ఆ భగవంతుడు ధైర్యాన్ని, మనశ్శాంతి ప్రసాదించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, డైరెక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తల్లికి వందనం ఓ మోసం..



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అశోక్

విజయనగరం గంటస్తంభం: ప్రభుత్వం అమలుచేస్తున్న తల్లికి వందనం పథకం ఓ మోసమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయమై జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో డీఎస్ఆర్ అమర్ భవన్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలప్పుడు ప్రతి విద్యార్థికి రూ.15 వేలు చొప్పున ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి ఇస్తానన్న సీఎం చంద్రబాబు ఇప్పుడు ఒక్కో ఇంట్లో ఇద్దరికే డబ్బులు వేశారని, అది కూడా రూ.13 వేలు చొప్పున వేశారని తెలిపారు. కరెంట్ బిల్లు 300 యూనిట్లు దాటిన వారికి, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి, నాలుగు చక్రాల వాహనం ఉన్న వారికి పథకం ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఇలా ఏదో కారణం చూపి పథకం ఆపడం ఎంతవరకు సమంజసమన్నారు. కనీస వేతనం పొందనటువంటి చిరు ఉద్యోగుల పిల్లలకు పథకం ఇవ్వకపోవడం దారుణమన్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమ్మఒడి పథకం కింద ఇచ్చే రూ.15 వేలులో రూ.20 వేలు పాఠశాల నిర్వహణకు కట్ చేసి ఇస్తే అప్పుడు విమర్శ చేశారని, ఇప్పుడు మీరేం చేశారని ప్రశ్నించారు. అప్పుడు కట్ చేయకుండా ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామన్నారని, ఇప్పుడేమో రూ.2 వేలు కట్ చేసి రూ.13 వేలు ఇచ్చారన్నారు. ఇది కాదా మోసం అని నిలదీశారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం నడవాలని హితవు పలికారు. ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్.రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని బోర్లు.. ప్రజలకు తప్పని అవస్థలు





విజయనగరంలో జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీ, ఆ పరిసర ప్రాంతాల్లోని పలుచోట్ల బోర్లు పనిచేయడం లేదు. దీంతో స్థానికులు తాగు, వాడుక నీటి కోసం అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి, బోర్లు బాగుచేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు. ఇదిలా ఉంటే కొన్నిచోట్ల బోర్లు వద్ద అపారిశుధ్యం పేరుకుపోవడంతో ఆ బోర్లు వద్దకు వెళ్లేందుకు ప్రజలు ఇష్టపడడం లేదు. అధికారులు స్పందించి, బోరు దగ్గర పారిశుధ్య పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

కొత్తవలసలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

కొత్తవలస: విభజన హామీ చట్టం ప్రకారం రాష్ట్రానికి మంజూరైన గిరిజన యూనివర్సిటీని కొత్తవలస మండలం రెల్లి రెవెన్యూ పరిధి అప్పన్నదొరపాలెం సమీపంలో ఏర్పాటు చేయాలని జనసేన పార్టీ క్రియాశీల సభ్యుడు కమ్మెళ్ల వెంకట సత్యనారాయణరాజు డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలోను, అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పలుమార్లు యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారన్నారు. వారు ఆ మాట నిలుపుకోవాలని కోరుతూ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పన్నదొరపాలెం గ్రామ సమీపంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని 2014 సంవత్సరంలో సుమారు 526 ఎకరాల భూమిని గిరిజనుల దగ్గర నుంచి సేకరించారని తెలిపారు. తీరా ప్రభుత్వాలు మారిన తర్వాత యూనివర్సిటీ మరో ప్రాంతానికి తరలిపోయిందన్నారు. మేము అధికారంలోకి వచ్చిన వెంటనే యూనివర్సిటీ అప్పన్నదొరపాలెంలో ఏర్పాటు చేస్తామని నమ్మబలికి టీడీపీ నాయకులు ఇప్పుడు చేతులెత్తేయడం తగదన్నారు. వర్సిటీ కోసం సేకరించిన భూములను గ్రేహౌండ్స్‌కు కేటాయించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని బీజేపీ, జనసేన అధినాయకుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

భారీ వర్షం.. రోడ్లన్నీ జలమయం!



విజయనగరం గంటస్తంభం: చెరువును తలపిస్తున్న జాతీయ రహదారి



విజయనగరంలో వర్షపునీటిలో వాహనదారు ప్రయాణం



విజయనగరం జెడ్పీ కార్యాలయం ఎదురుగా వరదనీరు

విజయనగరం, నెల్లిమర్ల ప్రాంతాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా కురిసిన వానకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధానంగా దిగువ ప్రాంతాల్లోని రోడ్లపైకి వరదనీరు పెద్దఎత్తున వచ్చి చేరుకుంది. దీంతో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్నిచోట్ల రెండు రోజుల పాటు వర్షాలు కురవగా, మరికొన్నిచోట్ల మధ్యాహ్నం, సాయంత్రం కుండపోత వర్షం పడింది. నీటమునిగిన రోడ్లు కొన్నింటిని ఈ చిత్రంలో చూడొచ్చు.

–విజయనగరం గంటస్తంభం, నెల్లిమర్ల రూరల్, సాక్షి ఫొటోగ్రాఫర్ విజయనగరం



నెల్లిమర్ల రూరల్: రామతీర్థం దేవస్థానంలోకి వచ్చేసిన వర్షపునీరు